

సజావుగా నిర్వహించాలి

ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.

- 10లో ▸



ఆయిల్‌పాం సాగుపై..


ఆయిల్‌పాం సాగుపై జిల్లా రైతులు దృష్టి సారించాలని విశ్రాంత శాస్త్రవేత్త కాళిదాస్ సూచించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7 /19.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



రాములోరి పెళ్లియంట..

ఆదర్శ పురుషుడు, మర్యాదా పురుషోత్తముడు, సత్యవాక్పరిపాలకుడు, సీతావల్లభుడు, సకల గుణధాముడైన జగదభిరాముడి కల్యాణానికి జిల్లా ముస్తాబయ్యింది. రామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా వేద మంత్రోచ్చారణల మధ్య రామచంద్రుడు సీతమ్మను మనువాడే క్రతువును వీక్షించడానికి భక్తకోటి ఎదురుచూస్తోంది.


తిర్మలాపూర్‌లో కొలువైన సీతారాములు


గౌరారంలోని శ్రీరామాంజనేయ స్వామి ఆలయం ముందున్న కోనేరు

- నేడు శ్రీరామనవమి
- ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు
- గౌరారంలో మూడు రోజులపాటు జరగనున్న వేడుకలు

సాక్షి, కామారెడ్డి: వసంత రుతువులో చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో శ్రీరామచంద్రుడు జన్మించాడు. చైత్ర శుద్ధ నవమి నాడే సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. సీతారాములు అరణ్యవాసాన్ని పూర్తి చేసుకుని అయోధ్యను చేరిందీ ఇదే రోజని పురాణాలు చెబుతున్నాయి. పితృవాక్య పరిపాలకుడైన కౌసల్యారాముడు.. సకల గుణాభిరాముడిగా కీర్తింపబడ్డాడు. ధర్మానికి నిలువెత్తు రూపంగా వర్ణింపబడ్డాడు. ఆ మహనీయుడి జన్మదినాన్ని, కల్యాణ మహోత్సవాన్ని గురువారం వాడవాడలా నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. సీతారాముల కల్యాణం అనంతరం పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహిస్తారు. పలుచోట్ల రథోత్సవాలు, కుస్తీ పోటీలు కూడా జరుగుతాయి.

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో దశాబ్దాలుగా శ్రీరామ నవమి వేడుకలు జరుగుతున్నాయి. మాచారెడ్డి మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న శాంతానంద తపోవనాశ్రమంలో రాములోరి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. కామారెడ్డి పట్టణ పరిధిలోని అడ్లూర్ రామాలయంలో, ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయంలో వారం పాటు ఉత్సవాలు జరుగుతాయి. లింగంపేట రామాలయంలో మూడు రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి. రథోత్సవం, ఎడ్ల బండ్ల ఊరేగింపు, అన్నదానం నిర్వహిస్తారు. బాన్సువాడ పట్టణం, తిర్మలాపూర్‌లలోని రామాలయాలు, దోమకొండలోని శివరాం మందిర్, తాడ్వాయి శబరిమాత ఆశ్రమం, నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని శ్రీ కోదండ రామాలయంతోపాటు చాలా హనుమాన్ ఆలయాలలోనూ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా పలు ప్రాంతాలలో భక్తులు ర్యాలీలు నిర్వహించనున్నారు.

గౌరారంలో వేడుకలు విభిన్నం..

గాంధారి మండలం గౌరారంలోగల శ్రీరామాంజనేయ స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఆ ఊళ్లో అడుగిడగానే ఆధ్యాత్మికత కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఆలయానికి ముందు పెద్ద కోనేరు ఉంది. అందులో కాళ్లు కడుక్కుని ఆలయ ప్రాంగణంలోకి వెళతారు. ఈ ఆలయంలో దీపం ఐదు వందల ఏళ్లుగా అఖండంగా వెలుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. గర్భగుడిలోకి పూజారి ఒక్కరినే అనుమతిస్తారు. శ్రీరామనవమి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఊరు ఊరంతా వేడుకల్లో పాల్గొంటారు. వేడుకల సందర్భంగా గ్రామంలో నివసిస్తున్న 18 కులాల వారు ఆయా పనుల్లో భాగస్వాములవుతారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను వారు కొనసాగిస్తున్నారు. ఉత్సవాలకు ముందే గ్రామంలో రైతుల ఇళ్లకు వెళ్లి ఎకరాకు కుంచెడు బియ్యం చొప్పున సేకరిస్తారు. ఆ బియ్యాన్ని ఒక దగ్గర కుప్ప చేసి పెడతారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం చేస్తారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు అన్నదానం ఉంటుంది. గురువారం శ్రీరామనవమి వేడుకల సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం జరిపిస్తారు. శుక్రవారం గండ దీపాలు వెలిగించి, రథోత్సవం నిర్వహిస్తారు. శనివారం గ్రామంలో కుస్తీ పోటీలు జరుగుతాయి. మూడు రోజులు పాటు జరిగే వేడుకలకు ఊరుఊరంతా హాజరవుతుంది. గ్రామస్తులు తమ బంధువులు, మిత్రులను సైతం వేడుకలకు ఆహ్వానిస్తారు.

న్యూస్‌రీల్

విద్యార్థినికి అభినందన



కామారెడ్డి రూరల్: తమిళనాడులోని మధురైలో ఇటీవల జరిగిన హాకీ జూనియర్(మహిళా విభాగం) సౌత్ జోన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థిని టి.శ్రావ్యను కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. శ్రావ్య కుప్రియాల్‌లోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలో చదువుతోంది. ఆమె బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసింది. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు నీలం లింగం, జిల్లా విద్యాశాఖాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన దీక్ష



కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోజ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరుద్యోగ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ, నాయకులు శ్రీరాం, ప్రణీత్, రోహిత్, మోహన్, విష్ణు, గణేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'వంద శాతం పన్నులు వసూలు చేయాలి'

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొండి బకాయిలు ఉంటే చట్ట ప్రకారం యజమానుల ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 70 శాతం వరకు పన్నులు వసూలయ్యాయని అధికారులు వివరించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, కమిషనర్ దేవేందర్ పాల్గొన్నారు.

భిక్కనూరు: ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన బుధవారం భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. పెద్దమల్లారెడ్డి, భాగిర్తిపల్లి గ్రామాలను సందర్శించి పల్లె ప్రగతిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీవో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

'అంబేడ్కర్ భవన పనులను వేగవంతం చేయండి'



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో రూ. 1.50 కోట్లతో చేపట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో రూ.38 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, గంగాధర్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఐకమత్యంగా ముందుకు సాగాలి'


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

భిక్కనూరు: ముదిరాజ్‌లు ఐకమత్యంతో ముందుకు సాగి, ఆర్థికాభివృద్ధి సాధించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ సూచించారు. బుధవారం ఆయన భిక్కనూరు పెద్దమ్మ ఆలయం ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. భిక్కనూరులో నిర్మిస్తున్న ముదిరాజ్ కల్యాణ మండపానికి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాములు, సర్పంచ్ తున్కి వేణు, ఎంపీటీసీ బండి చంద్రకళ, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్, సీనియర్ న్యాయవాది గజ్జెల భిక్షపతి, ముదిరాజు సంఘం ప్రతినిధులు ఉప్పరి రాములు, పాల రాంచంద్రం, బోండ్ల శేఖర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని హిందూవాహిని, శ్రీరామ సేనల ఆధ్వర్యంలో గురువారం కామారెడ్డిలో నిర్వహించనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. బుధవారం ఆయన కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి శోభాయాత్ర ప్రారంభమై పుర వీధుల గుండా సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు విపుల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



కామారెడ్డి టౌన్: ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షకు 8,142 మంది విద్యార్థులు హాజరయ్యారు. 303 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం జిల్లాకేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాల సెంటర్‌ను తనిఖీ చేశారు. ఇన్నాళ్లూ గదులను అద్దెకు తీసుకుని, హాస్టళ్లలో ఉండి చదివినవారు పరీక్షలు ముగియడంతో స్వగ్రామాలకు పయనమయ్యారు.


శిశువుకు పాలు పడుతున్న ఆయా

అల్పాహారం చేస్తున్న చిన్నారులు

వీరెనక విషాద గాథలు

- వింటే కన్నీళ్లాగవు..
- తల్లులకు దూరం చేసిన దయలేని విధి
- అక్కున చేర్చుకుంటున్న శిశుగృహ.. దత్తతతో కొత్తజీవితం

ఒక్కో పసి బిడ్డది ఒక్కో విషాద గీతిక.. ఒకరికి ముళ్ల పొదలే పొత్తిళ్లు ఐతే.. ఎవరి పాపమో మతిస్థిమితం లేని తల్లికి పుట్టింది మరో పాప.. భార్య నిద్రిస్తుండగా భర్త బిడ్డను ఎత్తుకెళ్లి అంగట్లో అమ్మకానికి పెట్టాడు ఇంకో దగ్గర.. ఆమెకు ఫిట్స్ వస్తే నాలుగు రోజులు కోమాలోనే ఉంటుంది. భర్త ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. ఈ స్థితిలో ఓ బిడ్డ తల్లికి దూరమైంది. ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు కొందరు.. ఇలా నిజామాబాద్‌లోని శిశుగృహకు చేరిన చిన్నారుల నేపథ్యాల్లో అంతులేని విషాదం కనిపిస్తుంది. వీరిని శిశుగృహ తల్లిలా ఆదరిస్తోంది. అందులోని సిబ్బంది మాతృ ప్రేమను పంచుతున్నారు. ప్రస్తుతం 12 మంది శిశువులు ఆశ్రయం పొందుతున్నారు. –బి ప్రభాకర్, నిజామాబాద్ డెస్క్

■ నయవంచన..

నగరానికి చెందిన యువతి ప్రేమించిన వాడి చేతిలో మోసపోయింది. కుటుంబ సభ్యులతో ఉండలేక ముంబయికి చేరింది. అక్కడా నయవంచనే... పరిచయమైన ఒకడు తోడుగా ఉంటానన్నాడు. ఆడబిడ్డ కలిగాక కనిపించకుండా పోయాడు. భర్త లేకుండా బిడ్డతో ఉన్న ఆ మెను నీ వెవరూ, ఎవరి బిడ్డ అంటూ కనిపించిన వారందరూ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఈ క్ర మంలో యువతి దాదాపుగా మతిస్థిమితం కోల్పోయింది. భిక్షాటన చేస్తూ వెళ్లి.. బెంగళూరు రైల్వే స్టేషన్‌లో పక్కన బిడ్డతో అపస్మారక స్థితిలో పడిఉండగా అక్కడి అధికారులు చేరదీశారు. ఆమె వద్ద లభించిన ఆధారాలతో నిజామాబాద్ తరలించి యువతికి వసతి కల్పించారు. బిడ్డను శిశుగృహలో చేర్చారు. ప్రస్తుతం పాపకు రెండేళ్లు.

■ ముళ్లపొదలే పొత్తిళ్లు ..

కామారెడ్డి జిల్లాలోని ఓ తండా వద్ద అప్పుడే పుట్టిన మగ శిశువును ఎవరో ముళ్ల పొదల్లో వదిలేశారు. అటు వెళ్లిన కొందరికి చీమలు పట్టిన బాలుడు అల్లాడుతూ కనిపించాడు. చీమలను దులిపేసి సపర్యలు చేశారు. బాలుడిని శిశు గృహకు తరలించారు.

■ అంగట్లో సరుకై..

సంచార జీవుల కుటుంబం డిచ్‌పల్లి మండలంలోని ఓ చెట్టు కిందకు చేరింది. బిడ్డతో భార్య నిద్రిస్తుండగా భర్త బిడ్డను ఎత్తుకెళ్లి వీధిలో అమ్మే ప్రయత్నం చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు శిశువును స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించారు. నిబంధనల ప్రకారం శిశువుని తల్లికి అప్పగిస్తామన్నారు. నెల రోజులు పోలీసులు, ఆస్పత్రి చుట్టూ తిరిగిన తల్లి తర్వాత కనిపించకుండా పోయింది. దీంతో శిశువును శిశుగృహకు తరలించారు.

■ నిస్సహాయ స్థితి..

ఆమెకు ఫిట్స్ వస్తే నాలుగు రోజుల పాటు అపస్మారక స్థితిలో ఉంటుంది. భర్త ఇంటి నుంచి వెళ్లగొట్టడంతో కొడుకు బాగోగులు చూడడం భారమైంది. ఆమె దీన స్థితిని చూసిన గ్రామస్తులు ఆమెతో పాటు బాలుడిని శిశుగృహకు తీసుకొచ్చారు. తల్లి బిడ్డను శిశుగృహ అధికారులకు స్వచ్ఛందంగా అప్పగించింది. వారం రోజులకే శిశు గృహకు వెళ్లి తన బిడ్డను తెచ్చుకుంది. వారం తిరక్క ముందే బిడ్డను శిశుగృహకు తీసుకొచ్చింది. బిడ్డను శిశుగృహ ఆవరణలో వదిలిపెట్టి వెళ్లింది.


నిజామాబాద్‌లోని శిశుగృహ

■ గోడకూలి భార్య, భర్త, కొడుకు మృతి చెందారు. ముగ్గురు ఆడపిల్లలు ప్రమాదం నుంచి బయట పడ్డారు. అధికారులు పెద్ద పిల్లలను గురుకులంలో చేర్పించి, చిన్న పాపను శిశుగృహకు తరలించారు.

■ తండ్రిలేడు.. తల్లి కూడా చనిపోవడంతో మైనారిటీ తీరని కొడుకు గొర్ల కాపరిగా మారాడు. గ్రామస్తులు ఇద్దరు ఆడపిల్లల్లో ఒకరిని గురుకులంలో చేర్చారు. చిన్న పాపను శిశుగృహకు తరలించారు. చెల్లిని చూసేందుకు అన్న శిశుగృహకు వస్తుంటాడు. చెల్లిని దత్తత ఇస్తే ఆమె భవిష్యత్తు బాగుంటుందని అధికారులు చెబితే.. అస్సలే దత్తత ఇవ్వనంటాడు. 'తాను కష్టపడి జీవితంలో నిలబడతానని చెల్లెళ్లను తీసుకెళ్లి తన వద్దే ఉంచుకుంటానని అంటాడు. మీరు బాగా చదివించండని అంటాడు.

■ కామాంధుల కాటు..

మతిస్థిమితం లేకుండా రోడ్డుపై తిరుగుతున్న ఆమెను 108 అంబులెన్స్‌లో సిబ్బంది జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె అప్పటికే నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు గుర్తించారు. నెలలు నిండే వరకు ఆస్పత్రిలోనే ఉంచి పురుడు పోసారు. పుట్టిన మగ బిడ్డను శిశుగృహకు తరలించారు.

■ శాపమైన ప్రేమ..

జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఆమె ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఓ యువకుడితో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. మైనారిటీ తీరకుండానే పాప, బాబుకు జన్మనిచ్చింది. తాగుడుకు బానిసైన యువకుడు నిత్యం శారీరక హింసకు గురిచేయడంతో విడిపోయారు. పిల్లల పోషణకు లావణ్య హోటళ్లలో పనిచేసేది. పని దొరకని నాడు భిక్షాటన తప్పేది కాదు. ఆమె వరంగల్ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల కంట పడింది. పిల్లలను తను పోషించలేని పరిస్థితిలో ఉన్నానని స్వచ్ఛందంగా అధికారులకు అప్పగించడంతో వారు పాప, బాబును శిశుగృహకు తరలించారు.

శిశుగృహలో మెనూ..

- ఆరు నెలల లోపు పిల్లలకు వైద్యుల సూచన మేరకు ప్రతి రెండు గంటలకు ఒకసారి పాలు (లాక్టోజిన్ – 1) అందిస్తారు.
- ఆరు నుంచి పన్నెండు నెలల లోపు పిల్లలకు రోజుకు రెండు సార్లు ఉగ్గు బాలామృతం, మూడు గంటలకు ఒకసారి (లాక్టోజిన్–2) ఇస్తారు. వీరికి ప్రత్యేకంగా బాడీ మసాజ్ చేయిస్తారు.
- ఏడాది నుంచి మూడేళ్ల లోపు వయస్సు పిల్లలకు ఉదయం పాలు, మెనూ ప్రకారం అల్పాహారం,గుడ్డు,ఇడ్లీ, చపాతి, ఉప్మా, అటుకుల ఉప్మా, సేమియా ఉప్మా, నెయ్యి, పెరుగు అందిస్తారు.
- మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు మెనూ ప్రకారం ప్రతిరోజు సమతుల్య ఆహారం ఇస్తారు. పిల్లలందరికీ సీజనల్ ఫ్రూట్స్ ఇస్తారు.

170 మంది పిల్లల దత్తత..

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే నిజామాబాద్‌లోని శిశుగృహ ద్వారా 2011 నుంచి ఇప్పటి వరకు 170 మంది పిల్లలను దత్తత ఇచ్చారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ రిసోర్స్ అడాప్షన్ అథారిటీ (కార) వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా దత్తత అప్రూవల్ కమిటీ పిల్లలను దత్తత తీసుకునే దంపతుల ఆర్థిక స్థితిగతులు, మెడికల్ ఫిట్నెస్ పరిశీలిస్తుంది. అప్రూవల్ కమిటీలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, శిశు గృహ మేనేజర్, మెడికల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. అప్రూవల్ కమిటీ సిఫారసు మేరకు పిల్లల దత్తతకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తారు. ఇటలీ, కెనడా, అమెరికా, జర్మనీ దేశాలకు కూడా పిల్లలను దత్తత ఇచ్చినట్లు నిజామాబాద్ శిశుగృహ అధికారులు తెలిపారు.

సంతానలేమి దంపతులకు మంచి అవకాశం



సంతానలేమి దంపతులకు పిల్లల దత్తత ప్రభుత్వం కల్పిస్తున్న మంచి అవకాశం. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో 'కార' వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకుని పిల్లలను దత్తత తీసుకోవాలి. దత్తత అప్రూవల్ కమిటీ ద్వారా జిల్లా కలెక్టర్ అనుమతితో పిల్లలను దత్తత ఇవ్వడం జరుగుతుంది.

– సుధారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, నిజామాబాద్

క్లుప్తంగా

నేత కార్మికులకు పని కల్పించాలి



రుద్రూర్: చేనేత కార్మికులకు సరిపడ పని కల్పించాలని సిద్దిపేట చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ కుమార్ ఆదేశించారు. రుద్రూర్ చేనేత సంఘాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సంఘంలో ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలు పరిశీలించారు. ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. నేత పనిపై ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇప్పించాలని, అవసరమగు సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యాలయంలో రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చేనేత డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రవీణ్, బోధన్ చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, మేనేజర్ ఈర్వ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ నర్సింలు ఉన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు



ఇందూరు: తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ వేడుకలను బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు నారాయణ, వీరాచారి, గంగాధర్, ఆనంద్ నర్సింలు, సత్యనారాయణ, జావేద్,సాయిబాబా పాల్గొన్నారు.

తెయూను సందర్శించిన సీపీఆర్‌హెచ్‌ఈ ప్రతినిధులు



తెయూ(డిచ్‌పల్లి): ఎగ్జామినేషన్ కంట్రోలర్ సర్వేలో భాగంగా బుధవారం తెలంగాణ యూనివర్సిటీని సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ ఇన్ హైయ్యర్ ఎడ్యుకేషన్ (సీపీఆర్‌హెచ్‌ఈ) న్యూఢిల్లీ ప్రతినిధులు సందర్శించారు. పరీక్షల మూల్యాంకనం పద్ధతులు, పరీక్షలు నిర్వహించే విధానాలను బృందం సభ్యులు డాక్టర్ గరిమ మలిక పరిశీలించారు. కంట్రోలర్ అరుణ వారికి వర్సిటీ డైరీలను అందజేశారు. అడిషనల్ కంట్రోలర్ సాయిలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన



కామారెడ్డి క్రైం: సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండడానికి అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకోవడమే కారణం అని ఎస్పీ తెలిపారు. పోలీస్‌శాఖలో ఉపయోగిస్తున్న అప్లికేషన్‌లను పూర్తిగా తెలుసుకోవాలన్నారు.

దైవచింతనలో గిరిపుత్రులు

- సేవాలాల్ దీక్షల్లో తరిస్తున్న గిరిజనులు
- తండాల్లో జగదాంబ దేవి, సేవాలాల్ మందిరాల నిర్మాణం
- రామనవమితో ముగియనున్న దీక్షలు



పూజలు చేస్తున్న సేవాలాల్ స్వాములు

బాన్సువాడరూరల్: అభివృద్ధికి ఆమడదూరంలో అడవుల్లో ఉండే బంజారాల జీవితాలు మారుతున్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలకు తోడు తమ ఆరాధ్య దైవం శ్రీరామరావు మహారాజ్ బోధనలు, ప్రేమ్‌సింగ్ మహారాజ్ ప్రారంభించిన సేవాలాల్ దీక్షలతో బంజారా బిడ్డల జీవనశైలి మారింది. మేముసైతం అంటూ భక్తి మార్గంలో పయనిస్తూ ఆదర్శజీవితం గడుపుతున్నారు. కామారెడ్డి జిల్లాలో 285 గిరిజన తండాలు ఉండగా, జనాభా సుమారు లక్షా 50వేలు ఉంది. ఈసారి సుమారు 4వేల మందికి పైగా శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ దీక్ష తీసుకున్నారు.

1979లో దీక్షలు ప్రారంభం

బంజారాలను ఏకం చేయడానికి 1979లో మొదటిసారిగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లికి చెందిన ప్రేమ్‌సింగ్ మహారాజ్ సేవాలాల్ మాలాధారణను ప్రారంభించారు. ఆరంభంలో మాలాధారణకు అంతగా ప్రాచుర్యం లభించలేదు. రామ్‌రావ్ మహారాజ్ ప్రతి తండాలో పర్యటిస్తూ తన బోధనలతో గిరిజనుల్లో మార్పునకు కారణమయ్యారు. ప్రస్తుతం ప్రతీ తండాలోనూ జగదాంబ మాత– శ్రీసంత్ సేవాలాల్ మందిరాలను నిర్మించుకున్న బంజారాలు వందల సంఖ్యలో మాల ధరిస్తున్నారు. ఒకప్పుడు గుడుంబా తయారీతో గుప్పుమనే కొన్ని గిరిజన తండాలు నేడు జీవనశైలిని మార్చుకుని భక్తి పారవశ్యంలో తేలియాడుతున్నాయి.

వ్యసనాలకు దూరం

తండాలో ప్రతి ఏటా శ్రీ రామ నవమి పండగకు 41 రోజులు ముందునుంచి సేవాలాల్ దీక్షలు చేపడుతున్నారు. ఇలా దీక్ష తీసుకుని మాలాధారణ చేసినవారు కఠిన బ్రహ్మచర్యం పాటిస్తూ ఉదయం, సాయంకాలం అమ్మవారికి హారతి ఇస్తూ గడపటంతో చెడువ్యసనాల నుంచి దూరంగా ఉండటానికి అవకాశం కల్గుతోంది. గులాబీ రంగు చొక్కా, తెల్లదోవతి ధరించి స్వాములు 41 రోజుల దీక్ష అనంతరం శ్రీ రామ నవమి నాడు మహారాష్ట్రలోని పొరాఘడ్ సందర్శించిన అనంతరం దీక్ష విరమించి భక్తిమార్గంలో నడుస్తున్నారు.

దీక్షతో సకల శుభాలు



పాత నిజామాబాద్ జిల్లాలో నేను మొదటి సారి దీక్ష తీసుకున్నాను. శ్రీసంత్ సేవాలాల్ దీక్ష చేపట్టిన వారికి సకల శుభాలు చేకూరి, జీవనం ఆనందమయంగా కొనసాగుతుంది. దీంతో దీక్షాధారుల సంఖ్య క్రమేపీ పెరుగుతుంది.

– హరిమహరాజ్, మైలారం తండా, నస్రుల్లాబాద్

ప్రశాంతంగా ఉంటుంది



దీక్ష తీసుకుని తండాల్లోని జగదాంబ, సేవాలాల్ మందిరంలోనే 41రోజులు గడుపుతుండడంతో మనసు ప్రశాంతంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం అమ్మవారికి హారతి ఇచ్చే భాగ్యం, భజన చేసే అవకాశం కలుగుతోంది.

– కేతావత్ సురేష్ మహరాజ్, బాన్సువాడ

‘పది’ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి
- వీసీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం ఆమె విద్యా శాఖ సెక్రెటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేనలతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను అధికారులు విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. వచ్చేనెల 3వ తేదీనుంచి 13 వరకు జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పదో తరగతిలో గతంలో ఉన్న 11 పేపర్లను ప్రస్తుతం 6 పేపర్లుగా కుదించామని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తప్పనిసరిగా ఏఎన్‌ఎం అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు రవాణా కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఉదయం, మధ్యాహ్నం వేళలలో నడపాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కలెక్టర్లు రవాణ, పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. bse. telangana. gov. in లో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచామని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 11,899 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని, వీరికోసం 63 కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. 595 మంది ఇన్విజిలేటర్లు, 63 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా పరీక్షల విభాగం అధికారి నీల లింగం తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

‘దక్కన్’పై మరిన్ని పరిశోధనలు జరగాలి

- మేడ్చల్ మల్కాజ్‌గిరి అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి
- ముగిసిన తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ సదస్సు



మాట్లాడుతున్న మేడ్చల్ మల్కాజ్‌గిరి అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): దక్కన్ ప్రాంతంపై మరిన్ని చారిత్రక పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ప్రసిద్ధ సాహితివేత్త, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ లా కాలేజీ సెమినార్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ముగింపు సమావేశంలో బుధవారం సాయంత్రం ఆయన పాల్గొని ప్రసంగించారు. దక్కన్ చరిత్రను పరిపూర్ణ రీతిలో రచించే క్రమంలో తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ కృషి చేయాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఇన్‌టాక్ కన్వీనర్ అనురాధరెడ్డి నిజామాబాద్ చరిత్రకు సంబంధించిన అనేక అంశాలను, సంస్థానాల విశేషాలను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన చరిత్ర పరిశోధకులు రమేష్ రామనాథం ‘భారతావనిలో బొమ్మల సంస్కృతి’ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఒంటి గుండు ప్రాంతంలో ఉన్న నల్లమూడి అడవులలోని రాతి చిత్రాల గురించి డాక్టర్ బీఎం రెడ్డి, శ్రీనివాస్, గోపి వరప్రసాద్‌రావు పత్ర సమర్పణ చేశారు. కందకుర్తి యాదవరావు ‘స్థానిక చరిత్ర’లపై చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం పూర్వ అధ్యక్షుడు కేఎస్ఎస్ శేషన్, ఆచార్య వెంకటరాజం, ఆచార్య అర్జునరావు, ఆచార్య సీహెచ్ ఆరతి, సమన్వయకర్త బాల శ్రీనివాసమూర్తి, సీహెచ్ ఆంజనేయులు, ప్రసన్న రాణి, మహమ్మద్ అబ్దుల్ కవి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అర్జునరావు అధ్యక్షుడిగా, ఎం వీరేందర్ ప్రధాన కార్యదర్శిగా, గౌరవ అధ్యక్షుడిగా వెంకటరాజం ఎన్నికయ్యారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సీపీ నాగరాజు పేర్కొన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విశిష్ట సేవా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి సీపీ హాజరై మాట్లాడారు. తన పదవీకాలం అనంతరం ఇలాంటి సంస్థ స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. అనంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతినిధులు కార్తీక్, ఆదిత్య, సురేష్, వినోద్, గంగారాం,అనిల్, గణేష్‌ను సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు,దారం గంగాధ ర్, లక్కంపల్లి సంజీవ్ రావ్, సుజాత, వాల బాలకిషన్, సుభాష్, వినయ్, అమర్, సతీష్ పాల్గొన్నారు.

గూగుల్‌లో కస్టమర్‌కేర్ నంబర్ వెతికితే..


- ఖాతాలో నుంచి రూ.రెండు లక్షలు మాయం

నిజామాబాద్ సిటీ: గూగుల్‌లో కస్టమర్‌కేర్ నంబర్ సెర్చ్ చేసి ఓ యువకుడు రూ.రెండు లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాలు.. చంద్రశేఖర్ నగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఫ్లిప్‌కార్ట్‌లో షూస్ బుక్ చేశాడు. దీంతో షిప్ రాకెట్ కొరియర్ నుంచి షూస్ వచ్చినట్లు అతనికి మెసేజ్ వచ్చింది. దీంతో ఆ యువకుడు షిప్ రాకెట్ కొరియర్ కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. సెర్చింగ్ చేస్తున్న సమయంలో సైబర్ నేరగాళ్లు యువకుడికి కాల్ చేశారు. షిప్ రాకెట్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమనగానే యువకుడు చెప్పాడు. దీంతో అతడి అకౌంట్‌లో నుంచి రూ.రెండు లక్షలు కట్ అయినట్లు మేసేజ్ వచ్చింది. దీంతో యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిన డ్రిప్ పైపులను చూపుతున్న రైతు



దగ్ధమైన మొక్కజొన్న పంట

మోర్తాడ్:శ్రీరామ నవమి తర్వాత పంట కోసి విక్రయించాలని భావించిన ఆ రైతుకు నిరాశే మిగిలింది. షార్ట్ సర్క్యూట్‌తో చేతికొచ్చిన మొక్కజొన్న పంట కాలిపోయింది. ఈ ఘటన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముచ్కూరి గంగానర్సు, తన సమీప బంధువు సహకారంతో మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసింది. ఈ పంట పొలం మధ్య నుంచి 11కేవీ సామర్థ్యంగల విద్యుత్ లైన్ ఉంది. ఆ తీగలకు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడటంతో తీగలు తెగి పంట పొలంలో పడ్డాయి. దీంతో మూడు ఎకరాల్లోని మొక్కజొన్న పంటతో పాటు డ్రిప్ కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

ఆస్పత్రి సెక్యూరిటీ గార్డ్‌పై రోగి బంధువుల దాడి



గాయపడ్డ గంగరాజు

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్‌పై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి బంధువులు దాడి చేశారు. అడ్డువచ్చిన అతని తమ్ముడిపైనా దాడి చేశారు. వివరాలు.. ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న కాకర్ల గంగారాజు మంగళవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో మెటర్నిటీ వార్డులో ప్రసవం అయి చికిత్స పొందుతున్న బాలింత వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులను బయటకు వెళ్లాలని కోరారు. మహిళల వార్డులో పురుషులు ఉండవద్దని రంజిత్, రాజు అనే ఇద్దరికి చెప్పాడు. దీంతో వారిద్దరు గంగరాజును హాస్పిటల్ నుంచి బయటకు ఈడ్చుకుంటూ వచ్చి తలపై దాడి చేశారు. అడ్డుకున్న ఓ నర్సును దుర్భాషలాడారు. అదే సమయంలో గంగరాజుకు టిఫిన్‌కు తీసుకుచ్చిన అతని తమ్ముడు కాకర్ల భరత్ అడ్డుకోగా అతినిపై కూడా దాడి చేశారు. దీంతో అన్నదమ్ములిద్దరికీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం చేరవేయడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకునేలోపే దాడి చేసిన వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన అన్నదమ్ములు ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి పట్టణ పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా యువ ఉత్సవ్



యువ ఉత్సవ్ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా జడ్జి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ పోటీలను బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో చిత్రలేఖనం, ఉపన్యాసం, గేయ రచన, ఫొటోగ్రఫీ, బృంద నృత్యం అంశాల మీద పోటీలు జరిగాయి. 172 మంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి జిల్లా ప్రధాన నాయమూర్తి కుంచాల సునీత హాజరయ్యారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాక్సింగ్ కోచ్ శంషోద్దీన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌కలెక్టర్ చంద్రశేఖర్, యువజన క్రీడల అధికారి ముత్తెన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంకుమార్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ బెల్లాల్ శైలీ పాల్గొన్నారు.

భూత వైద్యుడి మాటలు విని..

- చెరువులో స్నానానికి వెళ్లి మహిళ మృతి

మాక్లూర్: భూత వైద్యుడు చెప్పిన మాటలు విని చెరువులో స్నానానికి వెళ్లిన ఓ మహిళ నీట మునిగి చనిపోయింది. ఈ ఘటన బుధవారం మండలంలోని ఒడ్డెట్‌పల్లి గ్రామంలో జరిగింది. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. ఒడ్డెట్‌పల్లి గ్రామానికి చెందిన గోదూరి భూదేవి (45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సమస్యలు కూడా ఎక్కువ అవుతుండటంతో తట్టుకోలేక ఓ భూత వైద్యుడిని ఆశ్రయించింది. అతడు ఓ మందు ఇచ్చి బుధవారం తెల్లవారకముందే సేవించాలని చెప్పాడు. అంతే కాకుండా చెరువులో స్నానం చేసి అప్పటి వరకు ధరించిన వస్త్రాలను అక్కడే వదిలేసి నూతన వస్త్రాలను కట్టుకోని తిరిగి ఇంటికి వెళ్లాలని సూచించాడు. భూదేవి భూతవైద్యుడి సూచన మేరకు బుధవారం చెరువులో స్నానానికి వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త ఒడ్డెన్న, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరు దుబాయిలో ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

క్రైం కార్నర్


వాగులో స్నానానికి వెళ్లి బాలుడి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి(ఫైల్)

బోధన్‌టౌన్: వాగులో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన బోధన్‌లోని రాకాసీపేట్ కాలనీ శివారులో పసుపు వాగులో చోటు చేసుకుంది. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన గాంధారి శ్రీకాంత్‌రెడ్డి ప్రస్తుతం సరస్వతినగర్ కాలనీలో ఉంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరు స్నేహితులు మంగళవారం మధ్యాహ్నం విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటికి వచ్చి స్టడీ అవర్ ఉందని చెప్పి తీసుకెళ్లారు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో విష్ణువర్ధన్‌రెడ్డిని తీసుకెళ్లిన స్నేహితులను అడగ్గా మొదట తమకు తెలియదని సమాధానం చెప్పారు. బుధవారం ఉదయం మళ్లీ ప్రశ్నించగా ముగ్గురం కలిసి రాకాసీపేట్ శివారులోని పసుపు వాగులో స్నానం చేయడానికి వెళ్లగా విష్ణువర్ధన్‌రెడ్డి మునిగి పోయాడని చెప్పారు. దీంతో పసుపు వాగు వద్దకు వెళ్లి చూడగా బాలుడి మృతదేహం లభించింది. బాలుడి తండ్రి విష్ణువర్ధన్‌రెడ్డి ఇద్దరు స్నేహితులపై అనుమానం ఉందని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి



నాగిరెడ్డిపేట: మండలంలోని చీనూర్ సర్పంచ్ సౌందర్య భర్త మాసగల్ల లక్ష్మీనారాయణ(30) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం హైద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్న క్రమంలో గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ లక్ష్మీనారాయణ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామానికి చెందిన ఈర్ల గంగాధర్(28) జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. గంగాధర్‌కు నిర్మల్ జిల్లా ముధోల్‌కు చెందిన నిహారికతో వివాహం జరుగగా, వారిద్దరి మధ్య గొడవలతో విడాకులు తీసుకున్నారు. అప్పట్నుంచి జీవితంపై విరక్తి చెందిన గంగాధర్ నాలుగైదు సార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకోగా, చుట్టుపక్కల వారు గుర్తించి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు.

టిప్పర్, పాఠశాల బస్సు ఢీ

మోపాల్: మండలంలోని చిన్నాపూర్ శివారులో మూల మలుపు వద్ద బుధవారం ఉదయం టిప్పర్, పాఠశాల బస్సు ఢీకొన్నాయి. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. నగరంలోని ఓ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకెళ్లేందుకు వస్తుండగా, అదే సమయంలో చిన్నాపూర్ నుంచి బాడ్సి వైపు టిప్పర్ వెళ్తుంది. మూలమలుపు వద్ద నెమ్మదిగా వెళ్తున్నప్పటికీ.. రోడ్డు చిన్నగా ఉండటంతో టిప్పర్ అదుపు తప్పి పాఠశాల బస్సు ముందుభాగంలో ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 8మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వాహనాలు వేగంగా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. విద్యార్థులను వేరే బస్సులో పాఠశాలకు పంపించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై మహేష్ చెప్పారు. ఘటనా స్థలిని పరిశీలించామన్నారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదన్నారు.

విద్యార్థినిపై అత్యాచార యత్నం

- అధ్యాపకుడికి దేహశుద్ధి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ఓ ప్రైవేటు ఒకేషనల్ కళాశాల అధ్యాపకుడు, మరో ప్రైవేటు కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థినిపై అత్యాచార యత్నం చేయబోవడంతో పాటు, వేధిస్తుండడంతో స్థానికులు బుధవారం దేహశుద్ధి చేశారు. వివరాలు.. మంగళవారం ఇంటర్ పరీక్షలు రాసి ఇంటికి వెళ్తున్న విద్యార్థినిని సదరు అధ్యాపకుడు తాను అటువైపే వెళ్తున్నాని, బైక్‌పై దింపుతానని చెప్పాడు. దీంతో ఆమె బైక్‌పై ఎక్కగా.. గ్రామ శివారు దాటగానే అటవీ ప్రాంతంలోకి తీసుకుని వెళ్లే యత్నం చేయగా బాలిక తప్పించుకుని పారిపోయింది. బుధవారం మళ్లి బాలికను వేధించే ప్రయత్నం చేయడంతో గమనించిన స్థానికులు అధ్యాపకుడికి దేహశుద్ధి చేశారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లి గ్రామంలో అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పెనోళ్ల లక్ష్మణ్ (40) కుటుంబ అవసారాల కోసం, భార్య ఆరోగ్యం బాగుకోసం అప్పులు చేశాడు. ఈ విషయమై తరచు బాధపడేవాడు. బుధవారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వెంకటమ్మ, కుమారుడు శ్రావణ్ ఉన్నారు. వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న డీసీఎం

- మహిళ మృతి
- ఆమె భర్త, కుమారుడికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం టేక్రియాల్ శివారులో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం లారీని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆమె భర్త, కుమారునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన ముల్లాఖాన్, అతని భార్య షబీనా (31), కుమారుడు జాఫర్ ఖాన్‌లతో కలిసి డీసీఎం వ్యాన్‌లో బెంగళూరు వైపు వెళ్తున్నారు. ఇల్చిపూర్‌కు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న షబీనా అక్కడికక్కడే మృతి చెందగా ఆమె ఆరేళ్ల కుమారుడు జాఫర్‌ఖాన్, భర్త ముల్లాఖాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.